డా॥ జి.అరుణకుమారి

05.12.2009
ప్రొద్దుటూరు

# ఋగ్వేద రహస్యం

వేదం అంటే ఏమిటి? దాని స్వరూపం, స్వభావం, ప్రయోజనం, ఈనాటి సమాజానికి వేదాలతో ఉన్న సంబంధం ఏమిటి? మనం పోగొట్టుకున్న దేమిటి? అనే అంశాలను పరిచయం చేయటమే ఈనాటి లక్ష్యం.

మనకు తెలిసిన దాని కంటే తెలియనిదే ఎక్కువ. మనం చూసిన దానికంటే చూడనిదే ఎక్కువ. మనం విన్నదానికంటే మనం విననిదే ఎక్కువ. ఇది అందరికీ అంగీకార యోగ్యమైన విషయమే కదా.

భారత దేశంలో వేదాలకు ప్రముఖ స్థానముంది. పవిత్రమైన వేదాల ఆధారంగానే ధర్మ శాస్త్రాలు రూపొందాయి. అందుకే 'వేదోధర్మమూలం' అని అన్నారు.


## వేదం – నిర్వచనం :

'ఇష్ట ప్రాప్త్యనిష్ట పరిహారయోః అలౌకికం ఉపాయం యో వేదయతి వేదాః' అని అన్నారు. ఇష్టప్రాప్తి, అనిష్ట పరిహార సాధన కోసం అలౌకిక ఉపాయాన్ని ఏ గ్రంథం అందిస్తుందో అదే వేదం – అని సాయనాచార్యులు కృష్ణ యజుర్వేదానికి చెందిన తైత్తిరీయ సంహిత భాష్య భూమికలో వివరించారు. ముల్లును ముల్లుతోనే తొలగించాలి. వజ్రాన్ని వజ్రంతోనే ఛేదించాలనేవి లౌకిక అనుభవ సారాలయితే, ఇష్టప్రాప్తికి, అనిష్ట పరిహారానికి అలౌకికమైన ఉపాయాలను వేదాలు సూచిస్తున్నాయన్నమాట. భారతీయులకు విశ్వాసం, నమ్మకం మీద మనుగడ కొనసాగుతుంది. లౌకిక ఉపాయం అనుభవ సారమైతే అలౌకిక ఉపాయం అనుభూతి సారం.

## వేద స్వరూపం :

వేదాలు అపౌరుషేయాలు. వేదం వ్యక్తిచే నిర్మితం కావు. మంత్రద్రష్టలైన మహర్షులు వేద మంత్రాలను భగవంతుని వాక్కుల మూలంగా విని మౌఖికంగా ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. ఆచార్యుని మూలంగా శిష్యుడు విని రక్షితమైనవి కాబట్టి వేద మంత్రాలను శ్రుతులన్నారు. వేదాలు అనంత మైనవి కాబట్టి "అనంతావై వేదాః" అని అన్నారు. వేదాలు అనంత కాలాలకు చెందిన దర్శనాలు. వేదాలను వేదపురుషునిగా, వేదమాతగా భావించారు. వేదాన్ని అపరవిద్యానిగమము, ఆమ్నాయము, స్వాధ్యాయము అని వ్యవహరించారు.

వేదాలు నాలుగు : అవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం.




బ్రాహ్మణాలు గృహస్థులకు, ఆరణ్యకాలు, వానప్రస్థులకు, ఉపనిషత్తులు సన్యాసులకు ఉపయుక్తాలు. వీటినే వేదాంతమని అన్నారు. అశ్రమ ధర్మాన్ని పరిరక్షించేవిగా వేదాలు నిలిచాయి.

## వేదాంగాలు :

వేదాలను అర్థం చేసుకోవాలంటే వేదాంగాలు అవసరం. శిక్షా, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం, అనుక్రమణిక, ప్రాతిశాఖ్య, దేవతా అనేవి వేదాంగాలు. మొదటి ఆరింటిని షడంగాలుగా పేర్కొన్నారు.

విజ్ఞానఖని అయిన వేదాలను అవగతం చేసుకోవటానికి వేదాంగాలు అవసరం. వేదాంగాలు లౌకిక వ్యవహారానికీ అవసరమే. ఈనాటికీ మనం దీనికి ప్రాధాన్యం ఇస్తున్నాం. శిక్షా – ఉచ్చారణా శుద్ధత కలది. వ్యాకరణం – ప్రకృతి ప్రత్యయాల పద స్వరూపాన్ని వివరిస్తుంది. ఛందస్సుని వేద పురుషుని పాదాలుగా వ్యవహరించారు. ఛందః పాదౌతు వేదస్య, ఛందో పాదాలు లేనిదే గమనం లేదు.

నిరుక్తం వేదనిఘంటువు, వేదమంత్రాలకు శబ్దార్థాలను నిరాపేక్షాగా చెప్పేది నిరుక్తం. జ్యోతిషం కాలాన్ని తెలిపే శాస్త్రం. ముహూర్త జ్ఞానం, యజ్ఞ యాగాది క్రియల ముహూర్తాలను, వాటి ఫలితాలను వివరిస్తుంది. కల్పం వేదాలలో చెప్పబడిన యజ్ఞ యాగాది క్రియల ఆచరణ విధానాన్ని చెప్పేది. నేడు మనం చేపట్టే వ్రతాలు ఈ కల్పంలోనివే.




ధార్మిక నియమాలు, నాలుగు వర్ణాలు, నాలుగు ఆశ్రమాలను గురించి ధర్మసూత్రాలు వివరిస్తున్నాయి. కనుకనే ధర్మ సూత్రాలకు స్మృతులని పేరు. మనుస్మృతి, పరాశర స్మృతులు ధర్మ సూత్రాలుగా ప్రతిపాదింపబడ్డాయి. నేటి సమాజంలో ఈ ధర్మసూత్రాలు విమర్శింపబడుతున్నాయి. ఋషులు, దేవతలు ఛందోనువాక వర్గ సూక్తాలు ఏవి, ఎన్ని మొదలైన వాటిని వివరించేవి అనుక్రమణీ గ్రంథాలు. వైదిక శబ్దాల వ్యాకరణ ప్రక్రియా ప్రదర్శనకు ప్రాతిశాఖ్య గ్రంథాలని పేరు. దేవతలను ప్రతిపాదించటానికి లిఖించబడినవే దేవతా గ్రంథాలు.

## వేదం-ప్రయోజనం :

1. దేవతల గుణగణాలను స్తుతించేది.
2. యజ్ఞ యాగాది క్రతువులను వివరించేది.
3. జీవి నిత్య నైమిత్తిక కర్మలను తెలియజేసేది.
4. భగవంతుని చేరుకునే జ్ఞానాన్ని సూచించేది.
5. ఆధ్యాత్మిక విజ్ఞానానికి, ఆత్మ సంస్కృతికి ఉపయోగపడడానికి ఉద్దేశింపబడేది.
6. భూగోళ, గణిత, రసాయన, జీవ, తంత్ర సంగీత, విజ్ఞాన, నాటక, సాహిత్య అంశాలను తెలియజేసేది.

ఋగ్వేదం దేవతల గుణగణాలను స్తుతిస్తుంది. యజుర్వేదం యజ్ఞాలకు సంబంధించిన కర్మ కాండను వివరిస్తుంది. సామవేదం సంగీత ప్రధానం. అథర్వ వేదం బ్రహ్మ జ్ఞానాన్ని, శత్రు సంహారాది విద్యలను తెలియజేస్తుంది.

"ఋచ్యతే స్తూయతే యయా ఋక్".

దేనిచేత స్తోత్రం చేయబడునో అది ఋక్. స్తుతిపరాలైన అటువంటి మంత్రాల సమూహమే ఋగ్వేదం. ఋగ్వేదం సూక్త, మండల భేదాల చేత రెండు రకాలు.

ఋషి, దేవతా, ఛంద, అర్థ సూక్తాలని నాలుగు విధాలుగా వేదం వర్గీకరింపబడింది. ఒక మహర్షి చేత దృష్టమైన మంత్రాల సమూహాన్ని ఋషి సూక్తమని, ఏక దేవతా సంబంధమైన మంత్రాల సమూహాన్ని దేవతా సూక్తమని సమాన ఛందస్సుగల మంత్రాల సమూహాన్ని ఛందః సూక్తమని, ప్రయోజనాలను తెలియజేసే మంత్రాల సమూహాన్ని అర్థ సూక్తమని వ్యవహరిస్తారు. సు+ఉక్తం = సూక్తం అనగా బాగుగా చెప్పబడేదని అర్థం. ఋక్కుల సముహమే సూక్తం. ఋగ్వేదం మండలానువాక వర్గమని, అష్టకాధ్యాయ సూక్తమని రెండు రకాలుగా లభ్యమవుతుంది.

**ఋగ్వేదం**

| **10 మండలాలు** | **8 అష్టకములు** |
|---|---|
| **85 అనువాకములు** | **64 అధ్యాయములు** |
| **208 వర్గలు** | **1017 సూక్తములు** |
| **(మండలానువాకవర్గ భేదం)** | **(అష్టకాధ్యాయ సూక్త భేదం)** |

నాలుగు వేదాలకు ముందు ఋగ్వేదమే చెప్పబడుతుంది. ఋగ్వేదం అగ్నితో ఆరంభమై అగ్నితో ముగుస్తుంది.

ప్రపంచ వాఙ్మయంలో ఋగ్వేదమే ప్రప్రథమ గ్రంథమని ప్రాచీనులు పలికారు. "Rig veda is the first book in the library of man" అని మాక్స్ ముల్లర్ పలికాడు. అతడే మొట్టమొదటి సారిగా వేదాలను ప్రచురించాడు. మంత్రద్రష్టలైన మహర్షులు మధుచ్ఛందుడు, దైవరాతుడు, పిప్పిలాదుడు, పరాశరుడు, పురుచ్ఛేపుడు, గృత్సమద, విశ్వామిత్ర, వామదేవ, అత్రి, భరద్వాజ, వసిష్ఠ, మేధాతిథి, దీర్ఘతమ, వసుశ్రుత అసితాదులెందరో ఉన్నారు. స్త్రీలలో కూడ ఋషిత్వాన్ని పొందిన బ్రహ్మవాదినులున్నారు. ఉశన, మేధ, చైలకి, హైమ, విశ్వవార, సునీత, లోపాముద్ర, గౌరిదీతి, వృష మొదలైన వారున్నారు. మంత్రాలలో ఇంద్ర, అగ్ని, యమ, వరుణాది పురుష దేవుళ్ళతోబాటు అంబిక, అదితి, ఉష, రాత్రి, సరస్వతి మొదలైన స్త్రీ దేవతలు కూడ ఉన్నారు.

## ఋగ్వేదం అందించే కొన్ని ప్రధానాంశాలు :

★ మన ఆగమాలలో దేవతలు మంత్ర స్వరూపులుగా నిలిచారు. 'మననాత్ త్రాయతే ఇతి మంత్రః' అనగా మననం చేయటం వలన కాపాడునది మంత్రం. మనం మంత్రాన్ని, మంత్రార్థాన్ని, మంత్రాధిష్టాన దేవతను ఎంతగా మననం చేస్తామో అంతగా ఆ మంత్ర చైతన్యం మననం చేసేవారిని కాపాడుతుంది. నవవిధ భక్తులలో మననం ఒకటిగా గుర్తింపబడుతుంది.

★ వేదాలు మనకు దేవయజ్ఞం, పితృయజ్ఞం, మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం, ఋషియజ్ఞం గురించి తెలియజేస్తున్నాయి. దేవతలకు, తల్లిదండ్రులకు, తోటి మానవులకు, పశుపక్ష్యాదులకు, విజ్ఞానాన్ని అందించిన ఋషులకు కృతజ్ఞత భావంతో ఉండాలి అనే విషయాన్ని వివరిస్తుంది. విజ్ఞానాన్ని స్వాధ్యాయం చేయటమే

ఋషియజ్ఞం. మనం ఈనాటికీ అమ్మ, నాన్న, అక్క, తమ్ముడు, గురువు, శిష్యుడు అనే అనుబంధాలను కలిగి ఉన్నామంటే దానికి కారణం పూర్వీకులు మనకిచ్చిన సంస్కారమే కదా. అది ఈనాడు సన్నగిల్లుతుందంటే సనాతన జ్ఞానానికి దూరమైనట్లే భావించాలి. పాతదంతా వెలిబూది, గతం నాస్తి అని అంటే ఆ వాఙ్మయాన్నంతా ఆలంకారిక గ్రంథాలయాల్లో (Miniature Library) చూడవలసిందే. దానిని పరిచయం చేయవలసిన అవసరం పెద్దలదే కదా. వేదాలలో ఏముంది? అని నిర్లక్ష్యం చేసేదానికన్నా ఆధునిక దృక్పథంతో చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మాక్స్ ముల్లర్ వంటి పాశ్చాత్యులు వేదాలు ప్రాథమిక దశలోని ఆటవిక ప్రజల గీతాలే ఈ వేదసూక్తాలని చెప్పటమే ప్రమాణమని భావించి దానికి విలువనిచ్చి మన సంపదనే మనం దూరం చేసుకున్నట్లు కదా ! పాశ్చాత్యులు పరిశోధన చేసినా నూతన దృక్పథాన్ని స్వతంత్ర ప్రతిపత్తిని అందించలేకపోయారు. వారికి వేద బాహ్యమైన లౌకికార్థం కనిపించిందే కానీ అంతరంగ సత్యరహస్యం ఇసుమంతైనా కనిపించలేదు. ఈ పరిశోధనలే మనకు ప్రమాణాలై వేదాలపై ఆసక్తిలేకపోవటానికి ప్రధానకారణమయింది.

ఋగ్వేదంలో మొదటి సూక్తంలో మొదటి మంత్రం అగ్నిని పురోహితుడని వివరిస్తుంది.

'అగ్నిమీళే పురోహితం యజ్ఞస్యదేవ మృత్విజం । హోతారం రత్న ధాతమమ్ ॥'

పురోహితం–ప్రాణులకు హితం కూర్చువాడు, ఋత్విజం–యజ్ఞ ఋతు క్రమాన్ని నిర్వహించేవాడు.

హోతారం–దేవతలను ఆహ్వానించువాడు, రత్నధాతమం–శ్రేష్ఠుడైన, అగ్నిమ్–అగ్నిని, ఈళే–ఆహ్వానిస్తున్నాను.

ఈళ–ఈడ ధాతువుకు పూజ, యాచన, అధ్వేషణ అని యాస్క నిరుక్తం వివరిస్తుంది. శ్రీ అరవిందులు ఈళ ధాతువుకి ఆంగ్లంలో Aspiration (ఆకాంక్ష) అనే అర్థాన్ని సూచించారు. రత్నధాతమం–రత్నం అనగా యాగఫలరూపమైన రత్నం. రత్న మనగా అనందం అని శ్రీ అరవిందుల భాష్యం. మన ఆనందాన్ని శ్రేష్ఠంగా స్థాపించువాడు అగ్ని.

'అగ్నినా రయిమశ్నవత్పోషమేవ దివేదివే । యశసం వీరవత్తమమ్ ॥'

రయి ధన సూచిగా కనిపిస్తుంది. ఓ అగ్నీ ! శుభమైన మార్గంలో రయి కొరకు మమ్ము కొనిపొమ్ము అని దీని భావం. రయి అంటే సాయనుడన్నట్లు స్వర్గంలో ఉన్న ధనమా? ఈ ధనం కనకమో, పుత్రులో, పరివారమో కాదు. రయిని ఆధ్యాత్మిక సౌభాగ్యంగా శ్రీ అరవిందులు వివరించారు.

★ అగ్ని పూజకుని విశేషాలను అనుసరించి యజ్ఞాన్ని నడుపుతాడు. సాధకుని స్థితిని గమనించి ఏ దేవతను ఎప్పుడు పిలవాలో అగ్నికి తెలుసు. అందుకనే యజ్ఞానికి ముందు అతడుంటాడు. ముందుండి నడిపించేవాడు పురోహితుడు. భగవంతునికి భక్తునికి వాహికగా నిలిచేది అగ్ని.

★ దీప ధూప నైవేద్యాలను సమర్పించి భగవంతునికి, యజమానికి సంబంధాన్ని నెలకోల్పే పురోహితుడు అగ్ని. యజ్ఞం చేసేటప్పుడు అగ్ని ఉంటుంది. అది భౌతికమైనది కాదు. సామాన్య మానవులకు అది భౌతికంగా కనిపించే అగ్ని. కాని అది బ్రహ్మాగ్ని, సృష్ట్యాగ్ని, అంతరాగ్ని, మానసికాగ్ని, ఆత్మస్థైర్యాగ్ని, శుద్ధాగ్ని. దేవతలకు అధిపతి అగ్ని. దేవతల సందేశ కర్త. అశాశ్వతత్త్వానికి, శాశ్వతత్త్వానికి సంబంధాన్ని నెలకొల్పుతుంది. అగ్ని యజ్ఞానికి పురోహితుడుగా, ఋత్విక్కుగా, హోతగా నిలుస్తాడు.

★ అగ్ని మనిషిలో మాత్రమే కాదు, అతడు జలాలకు, అరణ్యాలకు, స్థావరజంగమాలకు శిశువు. వృద్ధుడు, జీర్ణుడు, మళ్ళీ మళ్ళీ బాలుడయ్యేవాడు మాతృగర్భంలో తీర్చబడి, ప్రాణిగా పెరిగి కదలికతో ప్రభంజనం కావడానికి మూలం అగ్ని. మానవులకు మొదటి దేవుడు అగ్ని. మానవునిలో భగవంతుని గూర్చిన యజ్ఞఇచ్ఛ, జ్ఞానఇచ్ఛ

అగ్ని రూపమే కదా. మానవునిలో దివ్యాగ్నిగా వెలుగుతుంది. మర్త్యులలో అమర్త్యాగ్నిగా నిలుస్తుంది.

★ వేదాలు అగ్నిని సత్యమని (The Truth), ఋతమని (The Right), బృహత్తని (The Vast.) పేర్కొన్నాయి.

శ్రీ అరవిందులు 'ఋతచిత్'ను Super mind (అధి మనస్సు) అని అన్నారు. శాశ్వత, అనంత ధర్మమే ఋతం. ఋతం అంటే Right Moment, Right Action. వేదమందు రహస్యంగా ప్రయోగించిన శబ్దాలనేకం. అందులో ప్రసిద్ధ స్పష్టార్థం చెప్పినపుడే రహస్య విషయం వ్యక్తమవుతుంది. దర్శన సిద్ధాంత మంతటికీ మూలస్తంభం ఋతం. ఋషుల తత్త్వాన్వేషణకు ప్రధానలక్ష్యం ఆధ్యాత్మిక ఆంతరసత్యం, దివ్యసత్యం, ఆత్మసత్యం, వస్తుసత్యం, జగత్సత్యం, ప్రాణకోటి మాటున ఉన్న సత్యం. కాని భాష్యకారులు ఋత శబ్దానికి కర్మకాండకు సుగుణమైన వ్యాఖ్యానమే చేసారు.

★ వేదం ఏకేశ్వరోపాసనను తెలియజేస్తుంది. ఏకేశ్వరత్వం అని, దేవతలందరు ఏకేశ్వరుని నామరూపాలేనని, ప్రకృతిలోనివన్నీ ఈశ్వరుని చేష్టలేనని, ఆధునిక శాస్త్ర పరిశోధన ఫలితాలన్నీ దానిలోనే గోచరమవుతాయని దయానందుని అభిప్రాయం.

' ఏకం సద్విప్రాబహుధా వదన్త్యగ్నింయమం మాతరిశ్వాన మాహుః ' (1-164-49)

'లోకాతీత సత్యస్వరూపుడైన అద్వితీయ పరమాత్మ యొక్క వివిధ నామరూపాలే దేవతలందరూ' అని తాత్పర్యం.

శ్రీ అరవిందులు వేదాలలో వర్ణింపబడిన నానా దేవతలు కేవలం ఒకే ఒక దివ్యపురుషుని నామాలు మాత్రమే కావు ఆ దేవతలకందరికీ వేర్వేరు శక్తి రూప మూర్తిమత్వాలున్నాయని, వేదం ఆధ్యాత్మిక విజ్ఞానానికి, ఆత్మ సంస్కృతికి ఉపయోగపడటానికి ఉద్దేశింపబడ్డాయని 'Hyms to mystic Fire' వేదికలో వివరించారు. ఆయన అతిమానసిక సాక్షాత్కారాన్ని గురించి నూతన అధ్యాయాన్ని వేదాలకు చేర్చారు. ప్రతి దైవం జన్మించి వేదాలకు చివరి ఖాళీ పుటను మళ్ళీ చేరుస్తుంటాడని వివరించారు.

★ వేదశిఖలైన ఉపనిషత్తులలో మానవుల తాత్త్విక చింతన పరమావధిని అందుకోవటం చూస్తాం. మానవుడు ఎదిగి ఎదిగి దివ్యమానవుడై చివరకు తానే దేవుణ్ణని తెలుసుకునే స్థితిని ఈ ఉపనిషత్తులు అందిస్తాయి.

1. అహం బ్రహ్మాస్మి – నేనే బ్రహ్మమును.

2. తత్త్వమసి – అదియే నీవు.

3. సర్వం ఖల్విదం బ్రహ్మ – అంతా బ్రహ్మమే.

4. ఏకమేవా ద్వితీయం బ్రహ్మ – బ్రహ్మము ఒకటే రెండవది లేదు. దీక్ష, తపస్సు, బ్రహ్మయజ్ఞం ఈ భూమిని భరిస్తున్నాయి.

★ భూత, వర్తమాన, భవిష్యకాలాలలో మానవులు ఉషాదేవిని దర్శించారు, దర్శిస్తున్నారు, దర్శిస్తారని ఋగ్వేదంలో వర్ణనాత్మక మంత్రం ఉంది. ఇటువంటి విశేషాలు వేదాలలో అనేకం ఉన్నాయి.

★ ఓషధులను గురించి, వైద్యపు మొక్కలను గురించి ఋగ్వేదం ప్రస్తావించింది (10.97). తైత్తిరీయ సంహిత, వాజసనేయ సంహిత 107 రకాల వైద్యపు మొక్కలను పేర్కొన్నాయి. పీడకలల నివారణకు, కీళ్ళనొప్పుల నివారణకు ఉపయోగించే మొక్కలను ఈ గ్రంథాలు సూచిస్తున్నాయి. వేళ్ళు, పళ్ళు, ఆకులు వాటి అమరికను కూడా వివరిస్తున్నాయి.

★ శస్త్రచికిత్సలను గురించి ఎన్నో విషయాలను పరిశీలించవచ్చు. ఖేలుడనే రాజు కాంత విశ్పల. యుద్ధంలో పాల్గొన్నప్పుడు కాళ్ళుతెగిపడిపోగా అశ్వినీ దేవతలు రాత్రికి రాత్రే ఆమెకు కృత్రిమ జంఘాలను అతికించారని ఋగ్వేదం వర్ణిస్తుంది.

'యాభిర్విశ్ఫలాం ధనసామధర్వ్యం సహస్రమీహ ఆజావజిన్వతం' (1-112-10)

★ కణ్వునికి కన్ను, దృషదముని పుత్రునికి శ్రవణేంద్రియాన్ని అమర్చటాన్ని ఋగ్వేదం వర్ణిస్తుంది.

★ గ్రాయత్రి మంత్రం - ఋగ్వేదంలోనిది.

(ఓం భూర్భువః స్వః ।) తత్సవితుర్వరేణ్యం ॥
భర్గోదేవస్య ధీమహీ । ధియోయోనః ప్రచోదయాత్ ॥

సర్వ శ్రేష్ఠంగా వరింపబడేవాడు చింతలను ప్రజ్ఞాదిశగా ప్రచోదనం చేయుగాక !

ఈ మంత్రం ఆధ్యాత్మిక సూర్యుడైన సవితృదేవుని సంబోధిస్తుంది.

భూలోకంలో దహించే పావకాగ్ని, భువర్లోకాలలో స్పందించే మేధాగ్ని, సువర్లోకంలో వెలుగొందే దివ్యాగ్ని అంతా అగ్ని స్వరూపమే కదా!